
# బెస్ట్ ఆఫ్ లక్!




ఆరోజు సీతారావ్‌ు పెళ్ళిచూపులు... ''కన్యాశుల్కం''లో గిరీశంలా, ''బారిస్టర్ పార్వతీశం''లో పార్వతీశంలా టక్ చేసుకొని, అద్దాన్ని ముందుకు వెనక్కూ మార్చిమార్చి యిన్‌షర్టు సరిగ్గా వచ్చిందో లేదో చూసుకొంటూ, తన అందానికి తానే మురిసిపోతూ, ఉత్సాహంగా ఈల వేస్తూ ముస్తాబయ్యాడు.

పెళ్ళి చూపులకు ఆడపెళ్ళి వారిచ్చిన సమయం తొమ్మిదిన్నర గంటలు.ధగధగ మెరుస్తున్న పాలిష్ చేసిన బూట్లు తొడుక్కుని, రూముకు తాళం వేసి, పెళ్ళికూతుర్ని ఊహించుకొంటూ 'జడ నిండ పూదండ దాల్చిన రాణి' పాటను కూనిరాగంలో ఖూనీ చేస్తూ, బయటకి వచ్చి, రోడ్డంబట నిల్చున్న ఆటోని చేరి, వెళ్లాల్సిన గమ్యం చెప్పి ఆటోలో చతికిలబడ్డాడు.

ఇంతకీ సీతారావ్‌ు చూడబోయే అమ్మాయి పేరు సుకన్య. వయస్సు యిరవై సంవత్సరాలు. డిగ్రీ ప్యాస యింది. సంగీతంలో కొద్దో గొప్పో ప్రవేశం కూడా వుంది. కట్నంమాట కొస్తే పాతిక వేల పై చిలుకు యివ్వగల స్తోమత గలవాళ్ళు. అందంలో మణిదీపం లాగుంటుంది. ఫోటో చూస్తే సీతారావ్‌ు హృదయం గాలిలో స్వైర విహారం చేసింది. అంత అందమయిన అమ్మాయిని తొలిసారి చూడబోతున్నందుకు సీతారాం ఆనందానికి పట్ట పగ్గాలు లేవు.

ఆటో తిన్నగా హిమాయత్‌నగర్ తొమ్మిదో నెంబరు వీధి చేరింది. బయటకు దిగి, ఆటో వాడికి యివ్వాల్సిన దానికన్నా ఓ రూపాయి టిప్‌గా ఎక్కువ యిచ్చి, ఈల వేసుకొంటూ హుషారుగా నడకసాగించాడు. పాకెట్ మిర్రర్ తీసి తలోసారి దువ్వి, అమ్మాయి వాళ్ళింటి నంబరు చూసుకొని గేటు దగ్గర ఆగాడు.


గిరిజా నారాయణ్

వచ్చింది పెళ్ళిచూపులకొచ్చినతనేనని ఎంతో అనుభవం ఉన్న అమ్మాయి తండ్రి యిట్టే పసిగట్టేసి, హడావుడిగా ఎదురొచ్చిమరీ లోపలికి తీసుకెళ్ళాడు.

యిల్లు ఎంతో అందంగా ఉంది. ముందు గది అంతా తివాసీ పర్చి, అందమైన సోఫాసెట్లు అమర్చబడి వున్నాయి. గోడలకు రంగు రంగుల సీనరీ వ్రేలాడు తున్నాయి. ఓ వైపు గోడకు జింక బొమ్మ వ్రేలాడు తోంది. మనీ ప్లాంటు తీగ కిటికీల కల్లుకొని ఉంది. దాన్నించి పిచ్చిక గూళ్ళు వ్రే లాడుతున్నాయి.

ఇంటి అందానికి ముగ్ధుడైపోతున్న సీతారావ్‌ుకు, ఆసరికే ముస్తాబయిన పెళ్ళికూతురు ఎదురుగా సోఫాలో సాక్షాత్కరించింది. ఆమె ముందు డెకలావ్‌ు టాప్ టేబిల్‌పై వీణ పెట్టబడివుంది.

సన్నటి బారుజడ కుడి భుజం పై వేసుకొని, చిలక పచ్చని జరీచీర కట్టి ఏదో చీరెల కంపెనీ అడ్వర్‌టైజ్‌మెంటులో హీరోయిన్‌లా కళకళలాడుతూ ధగద్ధాయమానంగా మెరిసిపోతున్నది. చూస్తున్నకొద్దీ యింకా చూసేలా ఉన్న గుండ్రటి పచ్చని ముఖం, కొనతేలిన చేపకళ్ళు, సన్నటి కోటేరేసిన ముక్కు, గులాబి. రంగులో నిగనిగలాడే చెక్కిళ్ళు-చూస్తున్నకొద్దీ సీతారావ్‌ుకు తను హీరో అయి, ఆ అమ్మాయితో పెళ్ళి చూపుల సన్నివేశంలోనే ''శంకరాభరణం'' సిన్మాలోలా ''సామజ వరగమన'' యుగళ గీతం పాడ్తున్న ఫీలింగ్ వచ్చి తన్ను తానే మర్చిపోయాడు.




"టిఫిన్ తీసుకోండి" అని అమ్మాయి తండ్రి చెప్పేవరకూ తనో క్రొత్త ప్రదేశంలో వింత వింత కలల్లో తేలియాడ్తున్న సంగతే గుర్తుకు రాలేదు సీతారామ్‌కు.

"థాంక్సండి. కలికితే అతకదంటారు. నేనీరోజునే మా వాళ్ళకు ఉత్తరం వ్రాస్తాను. మిగిలిన విషయాలు మీ పెద్దవాళ్ళు మాట్లాడుకోవచ్చు" అని చెప్పి క్రీగంట మరోసారి అమ్మాయిని చూసి జుట్టు సరిచేసుకొంటూ అదోరకం క్రొత్త పోజు పెట్టి బయటికి నడిచాడు.

మూడు గంటల సిన్మాలో హీరో హీరోయిన్లకి తొమ్మిది డ్యూయెట్స్ ఉంటే వారం రోజుల్లో ప్రత్యేక ఆటల్తో సహా-ఎన్ని డ్యూయెట్లు పాడుకోవచ్చో అన్ని డ్యూయెట్లూ ఊహించుకొంటూ కాలం గడిపేస్తున్న సీతారామ్‌కు "పోస్ట్" అన్న పిలుపు తీవ్ర రసభంగం కల్గించింది.

ఆనందపారవశ్యానికి భంగం కల్గిన చికాకుతోనే బయటికి వచ్చి సంతకం చేసి రిజిస్టర్డు లెటరు అందుకొన్నాడు. రిజిస్టర్డు లెటరు పైన ఫ్రమ్ అడ్రసు చూసి సీతారామ్ ఒక్క గంతు గెంతి, సీలింగ్ ఫాన్ తలకి కొట్టుకోవటంతో "అబ్బా" అంటూ తల పట్టుకొని కుర్చీలో చతికిలబడ్డాడు.

కవరు చింపి ఉత్తరం చదవటం ప్రారంభించాడు-

"డియర్ సార్- మీరు పెళ్ళి చూపుల కొచ్చి ఎంతో ఉదారంగా టిఫిన్ కూడా తినకుండా వెళ్ళినందుకు చాలా థాంక్స్. పెళ్ళి చూపులకంటూ వచ్చి వెళ్ళే వాళ్లతో మాకు-అంటే ఆడపిల్ల కలవారికి-అయ్యే ఖర్చుని గ్రహించి ఆ భారం కొంత మీరు తగ్గించినందుకు మరోసారి థాంక్స్. నన్ను చూసి ఏ వంకా పెట్టకుండా గౌరవంగా వెళ్ళినందుకు మెనీ మెనీ థాంక్స్. పాతిక వేల కట్నంతో, అయిదెకరాల సుక్షేత్రమైన పొలంతో-ఆఫ్ కోర్సు-అవి మా వాళ్ళే యిస్తాన్నారనుకోండి-సంతృప్తి పడ్డందుకు చాలా చాలా థాంక్స్. "నీకు వంట వచ్చా, పిడకలు చేయటం వచ్చా" అని పిచ్చి పిచ్చి ప్రశ్నలతో మీ మగ పెళ్ళివారికి సహజంగా ఉండే పైత్యప్రకోపం నాపై చూపించకుండా మౌనంగా వెళ్ళినందుకు చెప్పలేనన్ని థాంక్స్. పుస్తకాలు చదివించి, సర్టిఫికెట్లు పరీక్షించి చివరకు చందమామ పుస్తకం చదవమని అడగనందుకు కూడా ఎంతో థాంక్స్.

అసలు విషయానికొస్తే మీరు యిదివరకటి వాళ్ళలా కాక పప్పులో కాలేసినందుకు ఈ విషయం నేను ఈ విధంగా ముందే మీకు తెలియజేస్తున్నందుకు ఈసారి థాంక్స్ చెప్పటం మీ వంతు అవుతుందంటే ఆశ్చర్యం కాదు సుమా!

ఎందుకంటే-నే పుట్టుకతో రెండు కాళ్ళు లేని అవిటిదాన్ని కనుక! నేను సోఫాలో కూర్చున్నప్పుడు మీరు సరిగ్గా గమనించని నా రెండు కాళ్ళు కృత్రిమంగా ఏర్పాటుచేసినవి కనుక!! అబద్ధం చెప్పో, మాయ చేసో మా పెద్ద వాళ్ళు మీకు నన్ను కట్టబెట్టినా, నిజం తెల్సాక మీరు నాతో సుఖంగా కాపురం చేయలేరని చెప్పటానికి ఈ మాత్రం సాహసం చాలనుకొంటాను.

ఇట్లు,
మీ శ్రేయోభిలాషి
సుకన్య

### సమతూకం

తప్పులన్నీ ఒప్పులవుతాయి
వాళ్ళు ఒడిపోతూనే వుంటారు
నాందిలోనే నాటకాంతాన్ని వూహించుకుని
బొందితో కైలాసానికి చేరుకుంటారు!

—సౌభాగ్య

ఒక్కసారిగా భూమ్యాకాశాలు తల్లక్రిందులైనట్లు కాళ్ళక్రింద భూమి జరిగిపోతున్నట్లు, ఎండ వేడికి మంచు కరిగినట్లు నీరు కారిపోయాడు సీతారామ్.

'యింత డెలిబరేట్‌గా మోసమా!' సీతారామ్ హృదయం శోకంతో ఆక్రోశించింది. 'సుకన్య ఎంతో మంచిది కాబట్టి ఈ విషయాన్ని భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ముందే తనకు తెలిబర్చింది. ఎంతో నైస్ గర్ల్! లేకపోతే జీవితాంతం తను అఘోరించాల్సి వచ్చేది. అసలు యిలాంటి సంబంధం తెచ్చిన ఆ పెళ్ళిళ్ళ పేరయ్య సీతాపతిగాడ్ని నరికినా పాపం లేదు' అని తన మనస్సులోనే అనుకొంటూ దగ్గర్లోని పోస్టాఫీసు కెళ్ళి గబగబా రెండు ఉత్తరాలు వాళ్ళవాళ్ళకి గీకిపారేసి బయటపడ్డాడు.

* * * * * *

కొన్ని నెలల తర్వాత జరిగినదాన్ని క్రమంగా మర్చిపోగల్గుతున్నాడనుకొంటుండగా దూరంగా సుకన్య ఎవరితోనో నడిచివస్తూ కన్పించింది సీతారాంకు.

తనకు నిజాన్ని చెప్పి మహోపకారం చేసిన ఆ సహృదయినికి స్వయంగా కృతజ్ఞతలు చెప్పాలని అప్పటి కప్పుడే నిర్ణయించుకొన్నాడు సీతారామ్.

సుకన్య దగ్గరకు రాగానే "హల్లో" అని పల్కరించి ముందుగానే తను అనుకొన్నట్లుగా కృతజ్ఞతలు గడగడ వర్ణించాడు. అప్పటికి గాని సుకన్యకు విషయం బోధపడ లేదు. ఓసారి జాలిగా సీతారాం వైపు చూసి "భలే వారండి, నేను అవిటిదాన్నవటం ఏంటి-స్త్రీగా నా వ్యక్తిత్వాన్ని, నాలోని స్థిరమైన భావాలకు, అభిప్రాయాలకు ఓ రూపం యివ్వటానికి అలాంటి నాటకం ఆడక తప్పలేదు, మాకు అలా వ్రాయక తప్పలేదు. పైగా కట్నం యిచ్చి పుచ్చుకొనే పెళ్ళంటే నాకు పరమ అసహ్యం. నేను ప్రేమించిన సురేష్‌తోనే నా వివాహం జరగాలని ప్రతిసారీ ఏదో ఓ నాటకం ఆడాల్సి వచ్చింది. వచ్చిన సంబంధాలన్నీ వచ్చినట్లే పోయాయి. చివరకు మా వాళ్ళ ప్రాణం విసిగింది. నా ప్రయత్నంలో విజయం సాధించాను. సురేష్‌తో యిటీవల రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకొన్నాను. నేను చేసింది సరైనదనే నా విశ్వాసం. ఆపై మీ సహృదయత మీద విషయం ఆధారపడి వుంటుంది. నా ప్రక్కన ఉన్న ఈయనే ఆ సురేష్" అంటూ సురేష్‌ని పరిచయం చేసింది.

"హల్లో" అంటూ సురేష్ కరచాలనం చేశాడు సీతారామ్‌తో. అప్పటివరకు ఆమె ప్రక్క నిలుచున్న సురేష్‌ను గమనించనే లేదు సీతారాం.

వాళ్ళిద్దర్నీ చూస్తే తగిన జంట అనిపించింది సీతారాంకు. ఆ అందాలరాశి సురేష్ సొంతం అయినందుకు, తను మరీ ఘోరంగా మోసపోయినందుకు నిశ్చేష్టుడై అలానే నిల్చుండిపోయాడు సీతారాం. "బెస్ట్ ఆఫ్ లక్" మాటలు మాత్రం అప్రయత్నంగా అతని నోటి నుంచి వెలువడ్డాయి.